సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ జ్యోతి

కొమ్మాది: పరిశోధనలపై మెలకువలు పెంపొందించుకోవడం ద్వారా కొత్త ఆవిష్కరణలకు నాంది పలకవచ్చని డా.ఎస్.విజయ జ్యోతి పేర్కొన్నారు. శనివారం బీచ్‌రోడ్డు రుషికొండలోని గాయిత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, అటానమస్ కళాశాలలో రీసెర్చ్ మెథడాలజీపై రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. పరిశోధనలపై కాలంలో వస్తున్న మార్పులు వాటిపై నూతన విధానాలను ఎప్పటికప్పుడు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిఏ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.ఎస్ బోస్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రజిని తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థికి సాయం



వినయ్‌కు చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న చెల్లూరి వినయ్‌కు నగరంలోని లాసన్స్ బే కాలనీకి చెందిన సంస్కృతి గ్లోబల్ ప్రీ స్కూల్ యాజమాన్యం చదువుకునే నిమిత్తం శనివారం రూ.13,230 ఆర్థిం సాయం అందించింది. కొండపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వినయ్, అతని తల్లి రాజేశ్వరికి ఈ సాయం అందించారు. తమ స్కూల్ 9వ వార్షికోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు అందించే సాయంలో భాగంగా దీనిని అందించామని స్కూల్ యాజమాన్యం తరపున పరుచూరి నిరుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, వుయ్ కేర్ యూ సొసైటీల ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తీర్థగోష్టి



వారీజా ఆశ్రమానికి చేరుకున్న ఆహోబిల జీయార్ స్వామి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారీజా ఆశ్రమానికి శ్రీ ఆహోబిల జీయార్ స్వామి శనివారం చేరుకున్నారు. హయగ్రీవ మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం, సోమవారం శ్రీ అహోబిల జీయార్ స్వామి పర్యవేక్షణలో తీర్థగోష్టి నిర్వహించనున్నట్టు నిర్వహకుడు శ్రీకాంత్‌చార్యులు తెలిపారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవా యిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

రవాణా కష్టాలు తీరేదెన్నడో..!

- ఆర్‌టీసీ బస్సులు పునరుద్ధరించాలని వినతి
- స్వతంత్రనగర్, గణేష్‌నగర్, రేవళ్లపాలెంకు రాని బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గణేష్‌నగర్ వద్ద ఆక్రమణకు గురైన బస్ షెల్టర్



మధురవాడ: మహా నగరంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో మధురవాడ ఒక్కటి. ఇక్కడ ముఖ్యమైన ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కాలనీలు పదులు సంఖ్యలో ఉన్నాయి. మూడు జిల్లాల విద్యాశాఖ, ఆయుష్ కార్యాలయాలుతో పాటు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వంటి ముఖ్యమైనవి ఉన్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన వేలాది మంది నిత్యం ఉపాధి నిమిత్తం విశాఖ వెళ్లి రావాల్సి ఉంటుంది. దీనికి ట్రాన్స్‌పోర్టు అత్యంత అవసరం. కొత్త బస్సులు ఏర్పాటు దేవుడెరుగు ఉన్న బస్సులు కూడా కొన్ని చిన్న చిన్న కారణాలు చూసి తీసెయ్యడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో రవాణా వ్యవస్థను అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్టీసీ డిపో ఏర్పాటు తర్వాత కొన్ని చోట్ల గతంలో ఉన్న బస్సులు తీసేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బస్సులు రాక పోవడంతో బస్ షెల్టర్లు, దానికి కేటాయించిన స్థలాలు కూడా గణేష్‌నగర్ వంటి చోట్ల ఆక్రమణకు గురౌతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

బస్సులు పునరుద్ధరించాల్సిన ప్రాంతాలు

స్వతంత్రనగర్, గణేష్‌నగర్ ప్రాంతాలు నుంచి పాత పోస్టాఫీసుకు మొదట 25సి తర్వాత 25జి, ఇతర 7జి బస్సులు నడిపేవారు. రోడ్లు సరిగా లేవని, బస్సులు రాక పోకలకు ట్రాఫిక్ ఇబ్బందిగా మారుతుందని వంటి చిన్న చిన్న కారణాలతో ఐదేళ్లుగా ఈ సర్వీసులు నిలిచిపోయాయి. పెరుగుతున్న అవసరాలు, జనాభా రీత్యా మరిన్ని ఎక్కువ సర్వీసులు నడపాల్సింది పోయి ఉన్న బస్సులు రద్దు చేయడం తగదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిధిలాపురివు వుడా కాలనీ–ఐటీ సెజ్ రూట్‌లో కనీసం రద్దీ వేళల్లో అయినా మరిన్ని బస్సులు నడపాలని కోరుతున్నారు.

25కే రూట్ మార్పు :

మధురవాడ కూడలి, పీఎంపాలెం, ఐటీ సెజ్ కూడలి తర్వాత ముఖ్యమైన రోడ్డు రేవళ్లపాలెం రోడ్డు. ఈ రోడ్డులో పోలీసు స్టేషన్, నవోదయ, శాఫ్ స్టేడియం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విద్యా సంస్థలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రజలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. డీమార్టు వద్ద కొన్నాళ్ల క్రితం ఓ ప్రమాదం జరగడంతో 25కే సిటీ బస్సు రూట్ మార్చేశారు. దీంతో ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

యథావిధిగా బస్సులు నడపాలి

> ఒక ప్రమాదం కారణంగా రేవళ్లపాలెం–నవోదయ రూట్‌లో నడిచే 25కే బస్సు రూట్ మార్చేశారు. ఇది సరికాదు. బస్సు లేని కారణంగా ఆటోలతో అవస్థలు పడాల్సి వస్తోంది. బస్సులు లేని కారణంగా మహిళలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. బస్సును యథావిధిగా నడపాలి.
>
> – వి. కోమల్ సాయి, డిగ్రీ విద్యార్థి రేవళ్లపాలెం

1వ వార్డులో ఇద్దరి అదృశ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస సప్తగిరి థియేటర్ వద్ద తాత్కాలికంగా నివాసం ఉంటున్న శత్రుఘ్ను సాహూ ఇంటి నుంచి బైకూల్ ముండా అనే 14 ఏళ్ల బాలుడు ఈ నెల 14 మధ్యాహ్నం 3.30 సమయంలో అదృశ్యమయ్యాడు. ఒడిశాలోని దినకల్ జిల్లాకు చెందిన సాహూ ఉపాధి నిమిత్తం నెలరోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. అతనితో పాటు అదే రాష్ట్రానికి చెందిన అంగూల్ జిల్లా కుండాగూడ గ్రామానికి చెందిన బైకూల్ ముండాను వెంట తీసుకువచ్చాడు. బాలుడు అదృశ్యం తరువాత కుండాగూడలోని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించినా జాడ తెలియరాలేదు. దీంతో భీమిలి పోలీసుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ గంటా హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత కూడా..

జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన వివాహిత గూడెల భవాని ఈ నెల 16న ఇంటి నుంచి అదృశ్యమైంది. బాలాజీనగర్ వార్డు సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భవాని భర్త గోవిందరావులో చిన్న చిన్న తగాదాలు ఉండేది. పుట్టింటికి వెళ్తానని చెప్పి వెళ్లిన ఆమె అక్కడకు వెళ్లకపోగా ఇంటికీ చేరలేదు. దీంతో భర్త గోవిందరావు ఫిర్యాదు మేరకు భీమిలి పోలీస్ స్టేషన్ రైటర్ జి.సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో గీతం ఎస్‌టీఐ హబ్

కొమ్మాది: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎస్‌టీఐ హబ్ ఏర్పాటు గీతం విశ్వవిద్యాలయానికి అవకాశం దక్కింది. అరకు, పాడేరు మండలాల్లో 12 గిరిజన గ్రామాల్లో గిరిజనుల సామాజిక, ఆర్థిక స్వాలంబన సాధించడానికి వివిధ ఆధునిక స్వయం ఉపాధి మార్గాలపై నిరంతర శిక్షణ అందించేందుకు భారత ప్రభుత్వం శాస్త్ర శాంకేతిక విభాగానికి అనుభంద సీడ్ డివిజన్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి భారీ ప్రాజెక్టును మంజూరు చేసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ విభాగం పరిశోధకులు డా. ఐ. శరత్ బాబు ఈ ప్రాజెక్టుకు ప్రధాన పర్యవేక్షకుడిగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్టు అమల్లో భాగంగా రూ. 3.64 కోట్లు కేటాయించిందని శరత్‌బాబు తెలిపారు.

ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి ఆలయానికి భూమి పూజ

భీమునిపట్నం: ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మాణానికి త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి చేతులు మీదుగా శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ముప్పిరాల అనంతాచార్యుల స్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పురాణం శేషాచార్యులు, మనోజ్ కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, కె. శ్రీనివాసరావు, కేవీ భానోజీరావు, కె. చంద్రశేఖర్, వీ. తాతాజీ, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

ఉచిత కంటి వైద్యశిబిరం నేడు

తగరపువలస: స్థానిక బైపాస్‌రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేడపై లక్ష్మి విజయ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. భీమిలి సీడీ వెల్ఫేర్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించు ఈ శిబిరాన్ని స్థానికులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు



బీచ్ వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న నేవీ అధికారులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట బీచ్‌లో శనివారం పునీత్‌సాగర్ అభియాన్‌లో భాగంగా తూర్పు నౌకాదళ అధికారులు వ్యర్థాలను తొలగించారు. క్లీన్ బీచ్‌గా చూడాలని తమ ఉద్దేశమని అందుకే ఒక వైపు వ్యర్థాలను తొలగిస్తూ మరోవైపు ప్లాస్టిక్ వినియోగం వలన అనర్థాలను పర్యాటకులకు వివరిస్తున్నామన్నారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన 550 మందికిపైగా అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం అవసరం

విశాఖ, లీగల్ : న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టులో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.



ఎన్‌బీఎం న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

దంత సంరక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

భీమునిపట్నం: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు దంతసంరక్షణపై అవగాహన కల్పించారు. భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు సిద్దార్థ ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు నోటి పరిశుభ్రత, బ్రషింగ్ టెక్నిక్స్, ఆహారపు అలవాట్లను వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యంలో నూతన పోకడలతో ఎంతో ప్రయోజనం

మధురవాడ: వైద్యరంగంతో వస్తున్న నూతన పోకడలు, ఆవిష్కరణలతో రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పలువురు వైద్యనిపుణులు అన్నారు. శనివారం మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ వైద్య కళాశాలలో అనస్థీషియా విభాగం, ఐఎస్ఏ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో నెర్వ్ బ్లాక్స్ మీద వర్క్‌షాను నిర్వహించారు. దీనిని గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు, డీన్ సుబ్బారావు, ప్రొఫెసర్ రామమూర్తి అనస్థీషియా విభాగాధిపతి ఆచార్య కూర్మనాథ్, ఐఎస్ఏ ప్రెసిడెంట్, ఆంధ్ర వైద్య కళాశాల విభాగ అధిపతి ఆచార్య పద్మజ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగి శరీరం అంతటికీ అనస్థీషియా ఇవ్వకుండా ఎక్కడ ఆపరేషన్ చేస్తే అక్కడ ఇచ్చి, నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేయడమే కాకుండా జరుగుతున్న ఆపరేషన్ కూడా రోగి చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కొత్త పద్ధతుల వలన ముఖ్యంగా గుండె, కిడ్నీ, ఆస్తమా మొదలైన జబ్బులున్న వారికి ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. పెద్ద మత్తు ఉపయోగించలేని పరిస్థితిలో ఇది ఎంతో ఉపయోగం అన్నారు. ఇందులో మంగళగిరి ఎయిమ్స్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిమ్స్ శ్రీకాకుళం, మిమ్స్ విజయనగరం, గీతం, ఆంధ్ర మెడికల్ కాలేజిల అనస్థీషియా విభాగాధిపతులతో పాటు కోస్తాంధ్ర జిల్లాలకు చెందిన 100మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. మధురవాడ గాయత్రి విద్యార్థులకు ఈ కొత్తరకం పద్ధతులపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న అతిథులు

యువతే దేశానికి వెన్నెముక



యువ సదస్సులో ప్రసంగిస్తున్న కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ

మద్దిలపాలెం: యువతే దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని డాక్టర్.వి.ఎ స్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం నిర్వహించిన యువ సదస్సులో ఆమె మాట్లాడారు. భారతదేశం సుసంపన్నమైందని, యువత సమర్థవంతంగా పని చేస్తే, దేశం ప్రగతిపథంలో నడుస్తుందన్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి ఎండీ షఫీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపడుతున్న పథకాల గురించి వివరించారు. యువ దర్శకుడు ఆకిరి సురేష్ మాట్లాడుతూ యువత ప్రధాన అంశంగా చిత్రాలు వస్తున్నాయని, వాటిలో మంచిని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, జర్నలిస్టు ఎన్ఎస్ఆర్, నేషనల్ అవార్డు గ్రహీత లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ

ఎంవీపీకాలనీ: సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఎంవీపీ కాలనీ సెక్టార్–6 లోని భద్రం పార్కులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న కోటి సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, శ్రీరామనామ లిఖిత మహా యజ్ఞంలో భాగంగా శనివారం 108 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. శ్రీ అభయాంజనేయ సువర్చల పీఠం వ్యవస్థాపకులు మారుతి, వారి బృందం భక్తుల చేత హనుమాన్ చాలీసా పారాయణం చేయించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.



సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

భీమిలి
9666125299, 9912440606

'ఆసరా' లబ్ధిపై గ్రామాల్లో ప్రచారం

ఆనందపురం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఉన్న డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తానని పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ నెల 25న మూడో విడత రుణమాఫీ మొత్తాలను ముఖ్యమంత్రి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ మేరకు ఇందిర క్రాంతి పథం ఏపీఎం నాగభూషణం గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు రుణమాఫీ వివరాలను చెబుతున్నారు. మండలంలో మొత్తం 1291 సంఘాలు ఉండగా మొత్తం 13,701 సభ్యులు ఉన్నారు. 3వ విడత మాఫీ కింద రూ.10.45 కోట్లు లబ్ధిదారులు ఖాతాలలో జమకానున్నాయి. ఈ మేరకు డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు వివరాలను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ లింకేజ్ పర్సన్ ఆదినారాయణ, సీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురంలో ఆసరా మూడో విడత లబ్ధిని వివరిస్తున్న భూషణం

యాప్ ద్వారా మందుల ధరల మోసాలు తెలుసుకోవచ్చు

ఆనందపురం : జాతీయ ఫార్మా స్యూటికల్స్ విభాగం రూపొందించిన ఫార్మా సహిదామ్ అనే యాప్ ద్వారా మందుల ధరల వ్యత్యాసాలను తెలుసుకోవచ్చని కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ ప్రతినిధులు కవిత చెప్పారు. మండలంలోని తర్లువాడ ఉన్న వీతం ఫార్మా స్యూటికల్స్ సైన్స్ కళాశాలలో శనివారం నేషనల్ ఫార్మా స్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ), ప్రైస్ మోనటరీ అండ్ రీసోర్స్ (పిఎంఆర్)యూనిట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందులు ధరలలో వ్యత్యాసం ఉండడంతో సామాన్యులు మోసపోతున్నారని చెప్పారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ధరలు నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కోవిడ్ సమయంలో మందులు, వైద్య పరికరాలు విషయంలో సామాన్యులు దోపిడీకి గురి కాకుండా ధరలు నియంత్రణలో ఆ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దీని వలన వినియోగదారులు కొన్ని కోట్లను ఆదా చేయగలిగారని చెప్పారు. ఫార్మా సహిదామ్ యాప్‌ను వినియోగించి మందుల అసలు ధరలను తెలుసుకోవచ్చని సూచించారు. ఈ మేరకు యాప్‌కు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



యాప్ కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న కలామ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు

సామాజిక బాధ్యతగా రక్తదానం

ఆనందపురం : రక్తదానం అనేది సామాజిక బాధ్యత కావాలని సాయి గణపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌వర్మ చెప్పారు. కళాశాలలో శనివారం ఓఎస్‌జీ ఫౌండేషన్ సౌజన్యంతో లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రదీప్‌వర్మ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించవచ్చని చెప్పారు. రక్తదానం వలన ఆరోగ్య స్థితిని కూడా మెరుగు పరుచుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 114 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి



వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న సాంబశివరావు



స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

మధురవాడ: విద్యార్థులు సమయాన్ని వృథా చెయ్యకుండా మంచి లక్ష్యంవైపు నడవాలని మాజీ డీజీపీ ఎస్. సాంబశివరావు చెప్పారు. శనివారం మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కు హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కళాశాల సమయం చాలా ముఖ్యమైనదని, దానిని సక్రమంగా ఉపయోగించుకోవాల న్నారు. పెద్దలు చెప్పే మాటలు పాత చింతకాయ పచ్చడిలా తీసి పడేయవద్దన్నారు. అలాగే చదువుతో పాటు క్రీడలు, సాహిత్యం తదితర అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మంచి పుస్తకాలు చదవడం ద్వారా గొప్ప పరిజ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు, మెడల్స్, సర్టిఫికెట్లు అతిథులు అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, కార్యదర్శి పి. సోమరాజు, ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో నిమజ్జనానికి అమ్మవారి విగ్రహం తరలింపు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడ నుంచి విజయవాడ కృష్ణానదిలో నిమజ్జనానికి దుర్గాదేవి విగ్రహాన్ని శనివారం తరలించారు. గత ఏడాది అక్టోబర్ 5న విజయదశమి సందర్భంగా స్థానిక మాక్సీ కాబ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు అయిన గురుభవాని గుజ్జు సూరిబాబు కార్మికవాడలో మండపం ఏర్పాటు చేసి అమ్మవారి మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి 164 రోజుల పాటు అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న గోస్తనీనది మురుగునీటితో కలుషితం అయినందున అమ్మవారి సన్నిధి అయిన విజయవాడ కృష్ణానదిలో నిమజ్జనం చేయడానికి విగ్రహం ప్రతిష్ఠరోజే వారి కుటుంబ సభ్యులు తీర్మానించుకున్నారు. దీంతో శనివారం సాయంత్రం తీన్‌మార్, డీజేలతో అమ్మవారికి కార్మికవాడలో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక వాహనంలో అమ్మవారిని విజయవాడ తరలించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



చిట్టివలస నుంచి విజయవాడకు తరలిస్తున్న అమ్మవారి విగ్రహం

ఘనంగా 16 రోజుల ఉత్సవం

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 16 రోజుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల రెండో తేదీన అనంతుని కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. దీనిలో భాగంగా పాత సంత జరిగే ప్రాంతం నుంచి పుట్టు మన్నును కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకు వెళ్లారు. ఈ పుట్టమన్నును పాళి(ప్రమిదలు)కల్లో వేశారు. పాళికల్లో కల్యాణం జరిగే మూడో తేదీన నవధాన్యాలు వేశారు. వీటి ద్వారా వచ్చిన మొలకలు (అంకురాలు)ను అనంతును వద్ద ఉంచారు. వీటిని పట్టుకుని భక్తులు కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేశారు. తదుపరి వీటిని విసర్జింప చేస్తారు.



అంకురాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com